క్లుప్తంగా

ఎంపీడీఓకు సన్మానం



అల్లూరు: మండల ఎంపీడీఓ జ్యోతి ప్రకాశం జిల్లాకు బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో ఇంకా ఎవర్నీ నియమించలేదు. కాగా బదిలీపై వెళ్తున్న ఎంపీడీఓను మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు సోమవారం ఘనంగా సత్కరించారు.

డీఈఈ బాధ్యతల స్వీకరణ



ఆత్మకూరు: విద్యుత్‌శాఖ ఆత్మకూరు డివిజన్ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్‌గా శ్రీనివాసులు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన గతంలో ఇదే కార్యాలయంలో ఏడీఈగా పనిచేశారు. ప్రస్తుతం డీఈఈగా పనిచేస్తున్న బీ జనార్ధన్‌ను ఆకస్మికంగా బదిలీ చేశారు. నూతన డీఈఈను విద్యుత్ సిబ్బంది, యూనియన్ నాయకులు కలిసి అభినందనలు తెలిపారు.

తహసీల్దార్‌కు వినతి



మర్రిపాడు: నిరుపేదలమైన తమకు వ్యవసాయ భూమిని మంజూరు చేయాలని మండలంలోని నందవరం గ్రామానికి చెందిన ఆరవై ముస్లిం కుటుంబాల వారు కోరారు. ఈ మేరకు మైనార్టీ ముస్లిం లీగ్ ఆధ్వర్యంలో తహసీల్దార్ స్వప్నకు సోమవారం వినతిపత్రం అందజేశారు.

వంటపాత్రల అందజేత



ఆత్మకూరు: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు మధ్యాహ్న భోజన పథకం కోసం పూర్వ విద్యార్థుల రూ.41వేల విలువైన వంట పాత్రలను సోమవారం వితరణ చేశారు. గతంలో మధ్యాహ్నం భోజనం వడ్డిస్తున్న ఏజెన్సీ మానుకోవడంతో నూతనంగా ఇద్దరు మహిళలకు బాధ్యతలు అప్పగించారు. అయితే వంట పాత్రలు అందుబాటులో లేకపోవడంతో తెలుగు ఉపాధ్యాయుడు మధుసూదన్‌శాస్త్రి శిష్యులైన పూర్వ విద్యార్థులు (1989–95) ఆత్మకూరు డిప్యూటీఈఓ వై గోపాల్ చేతుల మీదుగా అందజేశారు. పూర్వ విద్యార్థులు పీ చాణిక్య, శ్రావణ్, సాయిప్రసాద్, శ్రీమాన్, కృపాకర్, రాజేష్, చల్లా శ్రీనివాస్, వెంకటేష్, ఫణీంద్ర, హరిబాబును డిప్యూటీ ఈఓ, హెచ్ఎం హెచ్ఎం అనంతలక్ష్మి, ఉపాధ్యాయులు అభినందించారు.

రేపటి నుంచి స్వర్ణాంధ్ర గ్రామసభలు

ఆత్మకూరురూరల్: ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి గ్రామ పంచాయతీలో స్వర్ణాంధ్ర గ్రామసభలను ఈ నెల 25 నుంచి నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్ సోమవారం తెలిపారు. గ్రామసభలను పంచాయతీ కార్య దర్శులు జయప్రదం చేయాలని కోరారు.

నేటి నుంచి పొలం పిలుస్తోంది

వింజమూరు(ఉదయగిరి): వింజమూరు వ్యవసాయ సబ్‌డివిజన్ పరిధిలో మంగళవారం నుంచి పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించనున్నట్లు వ్యవసాయ సహాయ సంచాలకులు రామిరెడ్డి సోమవారం తెలిపారు. ప్రతి మంగళ, బుధవారాల్లో కార్యక్రమం నిర్వహించనున్నట్లు వివరించారు.

వరికుంటపాడు/చేజర్ల/సీతారామపురం/మర్రిపాడు: వరికుంటపాడు మండలం విరువూరు, పెద్దిరెడ్డిపల్లిలో మంగళవారం, వరికుంటపాడు, రామాపురంలో బుధవారం, చేజర్ల మండలం చేజర్ల, మడపల్లిలో మంగళవారం, మాముడూరు, తూర్పుపల్లిలో బుధవారం, సీతారామపురం మండలం పబ్బులేటిపల్లి, చిన్నాగంపల్లిలో మంగళవారం, చింతోడు, పెదనాగంపల్లి గ్రామాల్లో బుధవారం, మర్రిపాడు మండలం మర్రిపాడు, ఈర్లపాడులో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆయా మండలాల ఏఓలు రవికుమార్, శశిధర్, చెన్నారెడ్డి, రామ్మోహన్ తెలిపారు.

హైస్కూల్‌లో ఆకతాయిల వీరంగం

సంగం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం ఆకతాయిలు వీరంగం సృష్టించారు. పాఠశాలలోని మరుగుదొడ్డి తలుపులు పగులగొట్టి సుమారు రూ.50వేల విలువ చేసే సామగ్రిని ధ్వంసం చేశారు. సోమవారం పాఠశాల తెరిచిన తరువాత ప్రధానోపాధ్యాయుడు బుజ్జయ్య గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కామ్రేడ్ ఏచూరికి నివాళి

మర్రిపాడు: ఇస్కపల్లిలో ఐద్వా మండల నాయకురాలు గొరవరం శ్యామలమ్మ ఆధ్వర్యంలో కామ్రేడ్ ఏచూరి సీతారాం చిత్రపటానికి సోమవారం పూలమాల వేసి నివాళులర్పించారు. ఐద్వా నాయకులు రత్నకుమారి, ఖాశింబీ, గురమ్మ లక్ష్మీదేవి, జ్యోతి పాల్గొన్నారు.

పడకేసిన పల్లె వైద్యం

సమ్మెలో పీహెచ్‌సీ వైద్యులు

- ప్రాథమిక వైద్యానికే వైద్యసిబ్బంది పరిమితం
- అందని అత్యవసర వైద్యసేవలు
- గాలిలో దీపంలా గర్భిణుల ప్రాణాలు
- వెలవెలబోతున్న పీహెచ్‌సీలు
- ప్రైవేట్ ఆస్పత్రులకు రోగుల పరుగులు



రోగులు లేక వెలవెలబోతున్న సీతారామపురం పీహెచ్‌సీ

సీతారామపురం: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న వైద్యుల నిరవధిక సమ్మెతో పల్లెల్లో వైద్యసేవలు పడకేశాయి. ప్రస్తుతం పల్లెల్లో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. పీహెచ్‌సీకి వచ్చినా వైద్యులు లేకపోవడం.. వైద్యసిబ్బంది ప్రాథమిక వైద్యానికే పరిమితం కావడంతో రోగులు ప్రైవేట్ ఆస్పత్రులు, ఆర్‌ఎంపీల వద్దకు పరుగులు తీయాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలు పేదల పాలిట శాపంగా పరిణమిస్తున్నాయి. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేసే వైద్యుల కనీస డిమాండ్లను పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యవైఖరిని అవలంభించడంతో గత్యంతరం లేక వారు సమ్మె బాట పట్టారు. ఫలితంగా వారం రోజులుగా పీహెచ్‌సీలో వైద్యసేవలు పూర్తిగా నిలిచిపోయాయి. సీజనల్‌వ్యాధులు విజృంభిస్తున్న తరుణంలో వైద్యులు అందుబాటులో లేకపోవడంతో గ్రామీణ ప్రాంత ప్రజలు విలవిల్లాడుతున్నారు. వైద్యులకు అండగా ఉండి గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు చర్యలు తీసుకోవాల్సిన ప్రభుత్వం అందుకు భిన్నంగా వ్యవహరిస్తోంది. వైద్యులకు ఇబ్బందులు తెచ్చిపెట్టే జీఓలు తీసుకొచ్చి వారి సహనానికి పరీక్షలు పెడుతోంది. దీంతో పీహెచ్‌సీ వైద్యులు సమ్మె బాట పట్టారు. పీహెచ్‌సీల్లో పనిచేస్తున్న వైద్యుల పీజీ, సర్వీసు కోటాను కుదిస్తూ ప్రభుత్వం జీఓ నంబర్ 85ను తీసుకురావడాన్ని నిరసిస్తూ రాష్ట్రవ్యాప్తంగా పీహెచ్‌సీ వైద్యులు సమ్మెకు దిగారు. జీఓ 85ను రద్దు చేయాలని కోరుతూ ఈ నెల 17న విజయవాడలో పెద్దఎత్తున ఆందోళన చేపట్టారు. ఈ నెల 18న ప్రభుత్వం చర్చలు జరిపినా అవి సఫలం కాకపోవడంతో వైద్యులు సమ్మెను కొనసాగిస్తున్నారు.



తెరుచుకోని వైద్యుల గది తలుపులు



ఖాళీగా ఉన్న బెడ్లు

నాడి పట్టే దిక్కులేక..

ఉదయగిరి నియోజకవర్గంలో సీతారామపురం, గండిపాళెం, దుత్తలూరు, వరికుంటపాడు, చాకలికొండ, కలిగిరి, కొండాపురం, జలదంకి, గట్టుపల్లిలో పీహెచ్‌సీలు ఉన్నాయి. వైద్యులు సమ్మెకు దిగి విధులకు హాజరుకాకపోవడంతో రోగులకు నాడిపట్టే దిక్కులేకుండా పోయింది. వైద్యసిబ్బంది ఉన్నా ప్రాథమిక వైద్యానికే పరిమితమవుతున్నారు. అత్యవసర వైద్యసేవలు అందడం లేదు. దీంతో చిన్నచిన్న సమస్యలు ఉన్న గ్రామీణులు ఆర్‌ఎంపీలను సంప్రదిస్తున్నారు. తీవ్రమైన రోగాలు ఉన్న పేదలు డబ్బు ఖర్చుచేసి ఎటు వెళ్లాలో తెలియక నానా ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం పీహెచ్‌సీలకు సుమారు 80 నుంచి 100 వరకు ఓపీలు వస్తుంటాయి. వైద్యులు లేకపోవడంతో రోగులు పీహెచ్‌సీకి వచ్చి తిరిగి వెళుతున్నారు. వైద్య సిబ్బంది ఉన్నా డాక్టర్ మందులు రెఫర్ చేస్తేనే వైద్యం చేసేందుకు వీలవుతుండడంతో పేదలు ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొంది.

గర్భిణుల పరిస్థితి దయనీయం

ఎప్పుడు నొప్పులొస్తాయో తెలియని గర్భిణుల పరిస్థితి మరింత దయనీయంగా మారింది. డెలివరీ అయ్యే పరిస్థితిలో ఉన్న గర్భిణులు అత్యవసరంగా డాక్టర్ కోసం సుదూర ప్రాంతాలకు పోవాల్సి వస్తోంది. ఈలోపు జరగరానిది జరిగితే దానికి బాధ్యత ఎవరు వహించాలన్నది ప్రశ్నార్థకంగా మారింది. ఆటోలు, ఇతర వాహనాల్లో సుదూర ప్రాంతం ప్రయాణించి ప్రైవేట్ వైద్యశాలలను ఆశ్రయించాల్సి రావడంతో గర్భిణులు ఇబ్బందులు పడుతున్నారు. దీనికితోడు అక్కడ వేలాది రూపాయలు చెల్లించే స్తోమతలేక, రవాణా ఖర్చులు భరించలేక సతమతమవుతున్నారు. అయినా ప్రభుత్వం ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టకపోవడంపై గ్రామీణులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

దోచుకుంటున్న ప్రైవేటు వైద్యశాలలు

ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఓపీల రేట్లు ఎక్కువగా ఉన్నాయి. అవసరాన్ని బట్టి వైద్యాన్ని వ్యాపారంగా మార్చి వసూలు చేసే ప్రైవేటు వైద్యశాలలకు పేదలు వెళ్లాలంటే వారి ఆర్థిక స్తోమతకు మించిన పనే. ప్రైవేట్ వైద్యశాలల్లో మందులు కూడా అధిక ధరలకు విక్రయిస్తుంటారు. కూలీనాలీ చేసుకునే పేదలు ఆ డబ్బు చెల్లించలేక..ప్రభుత్వ వైద్యం అందించేవారు లేక నానా ఇబ్బందులు పడుతున్నారు.

ఒంట్లో నలతగా ఉంటే వచ్చా



రెండ్రోజుల నుంచి ఒంట్లో నలతగా ఉండడంతో పీహెచ్‌సీకి వచ్చా. వైద్యులు సమ్మెలో ఉండి రాలేదని తెలిసింది. చేసేది లేక నర్సు ఇచ్చిన మాత్రలు తీసుకుని ఇంటికి పోతున్నా. డాక్టర్ ఉండి ఉంటే పరీక్షించి మందులు అందజేసే వారు.

– మేరమ్మ, ముత్తోల్లినగర్

జ్వరంతో వస్తే డాక్టర్లు లేరు



జ్వరంతో బాధపడుతూ వైద్యం కోసం పీహెచ్‌సీకి వచ్చా. తీరా ఇక్కడకు వచ్చాక డాక్టర్లు సమ్మెలో ఉండి రాలేదని తెలిసింది. వైద్యులు లేరని నర్సు మాత్రలు మాత్రమే ఇచ్చింది. సీజనల్ వ్యాధులు ప్రబలే కాలమైనందున ప్రభుత్వం స్పందించి ప్రత్యామ్నాయంగా వైద్య సేవలు అందించేందుకు చర్యలు చేపట్టాలి.

–గురవయ్య, మారంరెడ్డిపల్లి

విద్యార్థులకు ప్రతిభా పోటీలు



కావలి: డాక్టర్ డీఆర్ విశ్వోదయ బాలల దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని డాక్టర్ రామ్‌సెంటర్ విశ్వోదయ ఆధ్వర్యంలో పట్టణంలోని జవహర్ భారతి కళాశాలలో సోమవారం విద్యార్థులకు ప్రతిభా పోటీలను నిర్వహించారు. ఆంగ్ల, తెలుగు పద్యాలు, వ్యాసరచనం, చిత్రలేఖనం, పాటలు, తదితర పోటీలు జరిపారు. విశ్వోదయ విద్యా సంస్థల రెక్టార్ దొడ్ల వినయ కుమార్‌రెడ్డి, రామ్‌సెంటర్ చైర్మన్ దొడ్ల మనోహరరెడ్డి, డైరెక్టర్ కూనం తాతిరెడ్డి, ఆర్గనైజర్లు జ్యోతిశ్రీ , పీడీ ప్రసాద్‌రెడ్డి, ఆర్ మాల్యాద్రి ఆధ్వర్యంలో పోటీలు జరిగాయి. న్యాయనిర్ణేతలుగా రామచంద్రయ్య, అరుణ, పీ నారాయణ, నల్లూరు లక్ష్మీప్రశాంతి వ్యవహరించారు. అధ్యాపకులు బీ ఉమా మహేశ్వరి, సీహెచ్ ప్రత్యూష, ఎం శిరీష, పీ నారాయణ మణికంత, అమరావతి, నల్లూరు రామకృష్ణ పోటీలను పర్యవేక్షించారు.

ఆదరణ కేంద్రంలో అన్నదానం

బిట్రగుంట: బోగోలు మండలం ముంగమూరు కూడలిలోని ఆదరణ కేంద్రంలో కావలికి చెందిన కుప్పం బాలకృష్ణారెడ్డి సోమవా రం అన్నదానం చేశారు. తన సతీమణి సునంద జయంతి సందర్భంగా కుమార్తెలు మేఘనశ్రీ, లహరితో కలిసి ఆదరణ కేంద్రంలో ఆశ్రయం పొందుతున్న బాధితులకు పోషకాహారంతో కూడిన భోజనం ప్యాకెట్లు, వివిధ రకాల పండ్లు అందజేశారు. ఈ సందర్భంగా బాలకృష్ణారెడ్డి మాట్లాడుతూ ఆదరణ కేంద్రం నిర్వహణకు తమ వంతు సాయం అందించనున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఆదరణ కేంద్రం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వైద్యశిబిరానికి విశేష స్పందన



ఆత్మకూరు: వైద్యశిబిరంలో పాల్గొన్న వైద్యసిబ్బంది

ఆత్మకూరు: స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా ఆత్మకూరు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో సూపరింటెండెంట్ డాక్టర్ శేషారత్నం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. ఆత్మకూరు మున్సిపాలిటీతో పాటు పరిసర గ్రామాలకు చెందిన పారిశుద్ధ్య కార్మికులు, వారి కుటుంబ సభ్యులు సుమారు 260 మంది వైద్యశిబిరానికి హాజరయ్యారు. వైద్యులు ఉచితంగా వైద్యపరీక్షలు చేసి మందులు అందజేశారు. ఆర్‌ఎంఓ డాక్టర్ ఉషా సుందరి, వైద్యులు రామనాథ్‌రెడ్డి, సురేష్‌బాబు, బాలాజీ, ల్యాబ్‌టెక్నీషియన్ సుధాకర్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

ఉదయగిరి: స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా సోమవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. గ్రీన్‌అంబాసిడర్లు, గ్రీన్‌గార్డుల కుటుంబ సభ్యులకు వైద్యులు ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల శుభ్రతను పాటించాలని వైద్యురాలు అనీషా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు శివరామ్, ఠాగూర్, రజిత, మధుమోహన్, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ఉచితంగా ఇవ్వాలంటూ సీఐటీయూ ప్రదర్శన



ఆర్డీఓ కార్యాలయం ఎదుట నిరసన ప్రదర్శన చేస్తున్న సీఐటీయూ నాయకులు

ఆత్మకూరు రూరల్: పాదయాత్ర సందర్భంగా నారా లోకేశ్ ఇచ్చిన హామీ మేరకు బేషరతుగా ఇసుక ఉచితంగా అందజేయాలని కోరుతూ సీపీఎం అనుబంధ సంస్థ సీఐటీయూ ఆధ్వర్యంలో పట్టణంలో సోమవారం ప్రదర్శన చేపట్టారు. సీఐటీయూ పట్టణ అధ్యక్షుడు నాగయ్య, జిల్లా భవన కార్మికుల సంఘం కార్యదర్శి గోపాల్ ఆధ్వర్యంలో పట్టణంలోని ఎంజీఆర్ బస్‌స్టేషన్ నుంచి ఆత్మకూరు రెవెన్యూ కార్యాలయాల సముదాయం వరకు ప్రదర్శన నిర్వహించి ఇసుకను ఉచితంగా సరఫరా చేయకపోవడంపై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం పట్టణ కార్యదర్శి డేవిడ్‌రాజు, భవన నిర్మాణ కార్మికుల సంఘం పట్టణ అధ్యక్షురాలు గోవిందమ్మ, దాసయ్య, శ్రీరాములు, సిద్ధయ్య తదితరులు ప్రసంగించారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఆర్డీఓ మధులతకు అందజేశారు.

రెవెన్యూ అధికారుల బదిలీ

సీతారామపురం: మండల తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తున్న ఫాజిహ నెల్లూరు గ్యాస్ గోదాముకు బదిలీ అయ్యారు. సోమవారం ఆమె రిలీవ్ అయ్యారు. ఆర్ఐ శ్రీనివాసులు ఉదయగిరి, గంగవరం వీఆర్వో ఆదినారాయణ వరికుంటపాడు, బసినేనిపల్లి వీఆర్వో పెంచలయ్య ఉదయగిరికి బదిలీ అయ్యారు. కాగా నూతన జూనియర్ అసిస్టెంట్‌గా శ్రీకాంత్ బాధ్యతలు స్వీకరించారు.

వరికుంటపాడు: మండల తహసీల్దార్ ఎస్‌ఎండీ హుస్సేన్ నెల్లూరు కలెక్టరేట్‌కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో జలదంకి మండల తహసీల్దార్‌గా పనిచేస్తున్న హేమంత్‌కుమార్‌ను నియమించారు. ఆయన త్వరలో బాధ్యతలు చేపట్టనున్నారు.

ఉదయగిరి: ఎంపీడీఓ దేవరకొండ ఈశ్వరమ్మ సోమవారం ప్రకాశం జిల్లాకు బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో ఇంకా ఎవరిని నియమించలేదు. కాగా తహసీల్దార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్‌తో పాటు పలువురు వీఆర్వో లు బదిలీ అయ్యారు. వారి స్థానంలో కొత్తవారిని నియమించారు. ఉదయగిరి అటవీరేంజ్ పరిధిలోని దుత్తలూరు డీఆర్వో శ్రీనివాసులు తడకు బదిలీ అయ్యారు. కృష్ణంపల్లి బీట్‌కు తడ చెక్‌పోస్టులో ఉన్న శ్రీరాములును నియమించారు.

సంతాపం

సోమశిల: గోవిందంపల్లి పాఠశాల హెచ్‌ఎం ఎస్ విజయ్‌కుమార్(40) అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. కేతిగుంటలోని స్వగృహంలో ఉంచిన హెచ్‌ఎం భౌతికకాయాన్ని ఎంఈఓ–2 ప్రభాకర్‌రెడ్డి, వైఎస్సార్‌టీఎఫ్ సభ్యులు మెట్టుకూరు సుబ్బారెడి, డానియేల్, సహచర ఉపాధ్యాయులు సందర్శించి నివాళులర్పించారు.

పరిసరాల శుభ్రత అందరి బాధ్యత



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు

కావలి: పరిసరాల శుభ్రత అందరి బాధ్యతని కావలి ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓ సౌజన్య, ఏసీడీపీఓ శారద పేర్కొన్నారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా ముసునూరులోని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయం నుంచి సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల శుభ్రతను పాటించి వ్యాధులకు దూరంగా ఉండాలని సూచించారు. పోషకాహారంతో ఆరోగ్యాన్ని పదిలంగా ఉంచుకోవచ్చని తెలిపారు.గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పోషకాహారాన్ని తీసుకోవాలని సూచించారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషక విలువలు ఉన్న ఆహారాన్ని తీసుకుని వ్యాధి నిరోధక శక్తిని పెంపొందించుకోవాలన్నారు. లోక్‌అదాలత్ సభ్యుడు ఎం మాలకొండారెడ్డి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతన్నారు. ప్రతిఒక్కరూ ప్లాస్టిక్ కవర్లను నిషేధించడంతో పాటు మొక్కలు నాటి సంరక్షించాలని పిలుపునిచ్చారు.

ప్రజలు మెచ్చేలా వందరోజుల పాలన



గర్భిణులను ఆశీర్వదిస్తున్న మంత్రి ఆనం

ఆత్మకూరు: ప్రజలు మెచ్చేలా తమ ప్రభుత్వ వంద రోజుల పాలన సాగిందని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. మున్సిపల్ పరిధిలోని 22వ వార్డు పేరారెడ్డిపల్లిలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఇంటింటికి తిరిగి కరపత్రాలు అందజేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీలను నెరవేర్చడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఇప్పటికే 16,437 ఉపాధ్యాయుల పోస్టుల భర్తీకి డీఎస్సీ ప్రకటించినట్లు తెలిపారు. పెంచిన పింఛన్‌ను అందజేశామన్నారు. ధాన్యం కొనుగోలు బకాయిలు రూ.1674.47 కోట్లు చెల్లించి అన్నదాతలను ఆదుకున్నట్లు తెలిపారు. రూ.5కే అన్న క్యాంటీన్ల ద్వారా భోజనం, టిఫిన్ అందజేస్తున్నామని వివరించారు. అనంతరం మెప్మా ఆధ్వర్యంలో నిర్వహించిన సామూహిక సీమంతం కార్యక్రమంలో పాల్గొని గర్భిణులను ఆశీర్వదించారు. తొలుత తూర్పు వీధిలోని అలఘునాథస్వామి ఆలయంలో సంప్రోక్షణ, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం కల్యాణ మండపం నిర్మాణాన్ని పరిశీలించి పూర్తి చేసేందుకు దేవాదాయశాఖ నుంచి ఆర్థిక సహకారం అందజేస్తామన్నారు. ఆర్డీఓ కే మధులత, మున్సిపల్ కమిషనర్ గంగా ప్రసాద్, టీడీపీ నెల్లూరు పార్లమెంటరీ జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, నాయకులు ధనుంజయరెడ్డి, కే రవీంద్రారెడ్డి, సుధాకర్‌రెడ్డి, ఎన్ శ్రీధర్ పాల్గొన్నారు.

అట్టహాసంగా స్కూల్‌గేమ్స్ ప్రారంభం



ఆత్మకూరులో క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న డిప్యూటీ ఈఓ గోపాల్



ఉదయగిరి: వింజమూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో..

ఉదయగిరి: ఉదయగిరి నియోజకవర్గస్థాయి స్కూల్ గేమ్స్ పోటీలు వింజమూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. అండర్–14, 17 బాలబాలికలకు సంబంధించి రెండ్రోజుల పాటు నిర్వహిస్తున్న పోటీల్లో భాగంగా తొలిరోజు అథ్లెటిక్స్ జరిపారు. విజేతలు జిల్లాస్థాయి క్రీడాపోటీల్లో పాల్గొననున్నారు.

విజేతలు వీరే..

అండర్–17 బాలుర విభాగం:

- వంద మీటర్ల పరుగులో ఏఎఫ్ మొహిధర్(గండిపాళెం గురుకులం), పీ అర్షత్ (గండిపాళెం గురుకులం), బీ చరణ్ (విరువూరు), 200 మీటర్ల పరుగులో జే హర్షవర్ధన్ (గండిపాళెం గురుకులం), జీ నగేష్ (వింజమూరు), ఎల్ చరణ్‌తేజ (వింజమూరు), 400 మీటర్ల పరుగులో సీహెచ్ కుమార్ (గండిపాళెం గురుకులం), బీ రాహుల్ (గండిపాళెం గురుకులం), ఎం మధు (వింజమూరు) మొదటి మూడుస్థానాల్లో నిలిచారు.
- 800 మీటర్ల పరుగులో వీ చరణ్ (గండిపాళెం గురుకులం), 1500 మీటర్ల పరుగులో వీ వరుణ్‌తేజ (గండిపాళెం గురుకులం), 3వేల మీటర్ల పరుగులో కే అవినాష్ (గండిపాళెం గురుకులం) విజేతలుగా నిలిచారు.
- షార్ట్‌పుట్‌లో జే వివేక్(సోమవరప్పాడు), సీహెచ్ ఆనంద్ (కలిగిరి), బీ అవినాష్ (సిద్ధనకొండూరు), డిస్కస్‌త్రోలో జే వివేక్ (సోమవరప్పాడు), ఐ మహేంద్ర (కొండాపురం), ఏ మనోహర్ (అయ్యవారిపల్లి) మొదటి మూడు స్థానాల్లో రాణించారు. జావెలిన్‌త్రోలో పీ మహేష్ (వింజమూరు), లాంగ్ జంప్‌లో ఏ శశిమొహిధర్ (గండిపాళెం గురుకులం), హైజంప్, ట్రిపుల్ జంప్‌లో పీ అమ్రాన్ (విరువూరు) ప్రథమ స్థానంలో నిలిచారు.
- 400.100 మీటర్ల రిలేలో ఉదయగిరి ప్రథమ, వింజమూరు ద్వితీయ స్థానాలు సాధించాయి.

అండర్–17 బాలికల విభాగం:

- వంద మీటర్ల పరుగులో బీ ప్రసన్న (కొండాపురం కేజీబీవీ), 200 మీటర్ల పరుగులో జీ హస్యప్రియ (వింజమూరు), 400 మీటర్ల పరుగులో ఎస్కే అహ్మదున్నీసా (కలిగిరి మోడల్ స్కూల్), 800 మీటర్ల పరుగులో వీ లత (వింజమూరు), 1500 మీటర్ల పరుగులో జె.మధుప్రియ (వింజమూరు), 3వేల మీటర్ల పరుగులో బీ లక్ష్మి రిషినియా (నందిపాడు మోడల్‌స్కూల్) విజేతలుగా నిలిచారు.
- షార్ట్‌పుట్‌లో షేక్ షాహీన (ఊటుకూరు), షేక్ సోనియా (కలిగిరి), శాంతిప్రియ (సోమవరప్పాడు), డిస్కస్‌త్రోలో పీ శాంతిప్రియ (సోమవరప్పాడు), ఎస్ మనస్విని (గండిపాళెం జెడ్పీహెచ్‌ఎస్), పీ సుష్మ (అయ్యవారిపల్లి) మొదటి మూడుస్థానాల్లో నిలిచారు. జావెలిన్‌త్రోలో పీ భవిష్య (వింజమూరు), లాంగ్‌జంప్‌లో పీ ధరణి (కొండాపురం మోడల్‌స్కూల్), ఎస్కే సైరాభాను (వింజమూరు), ట్రిపుల్ జంప్‌లో ఎస్కే రోష్న (వింజమూరు) విజేతలుగా నిలిచారు.
- 400.100 మీటర్ల రిలేలో వింజమూరు జెడ్పీహెచ్ఎస్ ప్రథమ, కలిగిరి మోడల్‌స్కూల్ ద్వితీయ స్థానాలను సాధించాయి.

ఆత్మకూరు: ఆత్మకూరు నియోకవర్గ స్థాయి అండర్–14, 17 స్కూల్‌గేమ్స్ పోటీలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఆత్మకూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో ఆత్మకూరు డిప్యూటీ ఈఓ వై గోపాల్, హెచ్‌ఎం అనంతలక్ష్మి పోటీలను ప్రారంభించారు. తొలిరోజు అథ్లెటిక్స్ నిర్వహించారు. మండలస్థాయిలో సత్తాచాటిన క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. స్పోర్ట్స్ కోఆర్డినేటర్ తిరుపతయ్య, వ్యాయామ ఉపాధ్యాయులు సురేష్, జమునారాణి, గౌరీరెడ్డి, తదితరులు పర్యవేక్షించారు.

కావలియడవల్లి విద్యార్థుల సత్తా

అనుమసముద్రంపేట: ఆత్మకూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన ఆత్మకూరు నియోజకవర్గ స్థాయి స్కూల్ గేమ్స్‌లో కావలియడవల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థులు సత్తా చాటారు. ఎస్ సాయిచరణ్ డిస్కస్‌త్రోలో ప్రథమ, షాట్‌పుట్‌లో ద్వితీయస్థానం సాధించారు. కే హర్షిత డిస్కస్‌త్రో, షాట్‌పుట్‌లో ద్వితీయస్థానం సాధించి జిల్లా పోటీలకు ఎంపికయ్యారు. వారిని వ్యాయామ ఉపాధ్యాయుడు సీహెచ్ గురవయ్య, ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వరరావు అభినందించారు.

రూ.30కోట్లతో కలిగిరి-వలేటివారిపాళెం రోడ్డు



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కాకర్ల

కొండాపురం: కలిగిరి నుంచి వలేటివారిపాళెం వరకు రూ.30 కోట్లతో డబుల్‌రోడ్డు నిర్మాణం చేపడుతున్నట్లు ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ తెలిపారు. కొండాపురంలో రోడ్డు నిర్మాణ పనుల శిలాఫలకాన్ని సోమవారం ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఆదర్శ పాఠశాలలో నిర్వహించిన సరస్వతి పూజలో పాల్గొన్నారు. విద్యార్థులతో కొద్దిసేపు మాట్లాడారు. అనంతరం బీసీ కాలనీలో మాజీ వైస్‌ఎంపీపీ పోలినేని చంద్రబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంటింటికి తిరిగి కరపత్రాలను అందజేశారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మహేంద్ర తమకు సహకరించడం లేదని పలువురు టీడీపీ నాయకులు ఫిర్యాదు చేశారు. టీడీపీ మండల కన్వీనర్ ఎం ఓంకారం, మాజీ కన్వీనర్లు పాల్గొన్నారు.

చిరుద్యోగులపై కక్ష సాధింపు చర్యలు తగవు



సీఐటీయూ, ఎమ్మార్పీఎస్ నాయకులతో కలిసి ఆందోళన చేస్తున్న ఆశాలు

కలిగిరి: దళితులను వేధింపులకు గురిచేయడం, దళిత చిరుద్యోగులను విధుల నుంచి తొలగిస్తూ కక్ష సాధింపు చర్యలకు పాల్పడడం తగదని ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కే విజయలక్ష్మి అన్నారు. రావులకొల్లు ఆశాకార్యకర్త పందిటి విజయమ్మను విధుల నుంచి తొలగించడాన్ని నిరసిస్తూ ఆశాకార్యకర్తలు సోమవారం ర్యాలీ చేపట్టారు. సీఐటీయూ, ఎమ్మార్పీఎస్, ప్రజాసంఘాల నాయకులతో కలిసి కలిగిరి పీహెచ్‌సీ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి తహసీల్దార్ చొప్పా రవీంద్రబాబుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రావులకొల్లు సర్పంచ్ పూసాల వెంగప నాయుడు విధుల నుంచి తొలగించబడిన ఆశాకార్యకర్త విజయమ్మకు బాసటగా నిలిస్తున్న ఆశాకార్యకర్తలను బెదిరింపులకు గురిచేయడం మంచి పద్ధతి కాదన్నారు. విజయమ్మను విధుల నుంచి తొలగించమని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ హామీ ఇచ్చినా సర్పంచ్ జిల్లా స్థాయి వైద్యాధికారుల మీద ఒత్తిడి తీసుకొచ్చి విజయమ్మపై చర్యలు తీసుకోవడం దారుణమన్నారు. ఎమ్మెస్పీ జిల్లా అధ్యక్షుడు పందిటి అంబేద్కర్ మాట్లాడుతూ 18 ఏళ్లుగా అంకితభావంతో పని చేస్తున్న విజయమ్మను వెంటనే విధుల్లోకి తీసుకోవాలన్నారు. దళితులపై వేధింపులను ఆపకపోతే ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం చేపట్టి తగిన రీతిలో బుద్ధి చెబుతామని హెచ్చరించారు ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు సూరిపాక ఉదయకృష్ణ, మహిళా సంఘ జిల్లా అధ్యక్షురాలు మంద సుజాత, మండలాధ్యక్షుడు నందిపోగు వెంగళరావు, సీఐటీయూ నాయకులు పెంచలయ్య, మల్లికార్జున్, ఖాదర్‌బాషా, ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు అరుణ, మేరీ, తదితరులు పాల్గొన్నారు.